అంగన్‌వాడీ భవనం నిర్మించేందుకు కృషి



బాలంరాయిలో పర్యటిస్తున్న జంపన ప్రతాప్

రాంగోపాల్‌పేట్: బాలంరాయిలో అంగన్‌వాడీ భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ బస్తీ ప్రజలకు హామీ ఇచ్చారు. మంగళవారం ఈద్గా అంబేడ్కర్ నగర్‌లో ఆయన పర్యటించగా, స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ భవనంతో పాటు కమ్యూనిటీహాల్ నిర్మాణం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజేష్‌యాదవ్, జమీల్, రాజు, అన్నానగర్ మురళి, చంటి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



శశాంక్

బొల్లారం: ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగానికి రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుమలగిరికి ప్రాంతానికి చెందిన శశాంక్ పసుపులేటి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐపీసీ జాతీయ కమిటీ అధికారిక ప్రకటన జారీ చేసింది. ఈ సందర్భంగా శశాంక్ పసుపులేటి మాట్లాడుతూ 'ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ నాయకులు, నేషనల్ హెడ్‌లు, సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై నాకున్న విశ్వాసం, కట్టుబాటు మరింత బలపడిందన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి, ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు నా శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు. 2028లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడానికి కృషి చేస్తూ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు, జాతీయ కోఆర్డినేటర్లు, తెలంగాణ రాష్ట్ర నాయకులు శశాంక్‌కు అభినందనలు తెలియజేశారు.

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం



వారాసీగూడలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: వారాసీగూడ ప్రాంతంలోని తాగునీటి సమస్యలకు త్వరలో పరిష్కార మార్గం చూపుతామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ చెప్పారు. మంగళవారం వారాసీగూడ ఎస్‌బీఐ లైన్ ప్రాంతంలో పర్యటించిన కార్పొరేటర్ సామల హేమ స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. భూగర్భం నుంచి ఉన్న వాటర్‌లైన్లు శిథిలం కావడంతో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇక్కడ కొత్త పైప్‌లైన్ పనుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం అయినట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ అనంతరం అధికారులతో మాట్లాడి పైప్‌లైన్ ఆ మీదట రహదారి నిర్మాణం పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు ఎస్‌బీఐ లైన్‌తో పాటు మహ్మద్‌గూడ, రెడ్‌క్రాస్ ఏరియా ప్రాంతాల్లో మరమ్మతు పనులు చేయిస్తామని చెప్పారు.

కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్ బదిలీ



కంటోన్మెంట్: కంటోన్మెంట్ సీఈవోగా కొనసాగుతున్న మధుకర్ నాయక్‌ను ఢిల్లీ కంటోన్మెంట్ రక్షణశాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ అదనపు డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్) విభాశర్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఢిల్లీ కంటోన్మెంట్ డీజీడీఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అర్వింద్‌కుమార్ ద్వివేదిని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సీఈవోగా బదిలీ చేస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అర్వింద్‌కుమార్‌ది స్వస్థలం ఘోరక్‌పూర్ కాగా ఆయన కలకత్తాలోని మెరిన్ ఇంజనీరింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసి ఐడీఎస్ అధికారిగా రక్షణ శాఖలో చేరి సేవలు అందిస్తున్నారు. ఇంత వరకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సీఈవో గా విధులు నిర్వహించిన మధుకర్ నాయక్ 2022 నవంబర్ 11న ఇక్కడ బదిలీపై వచ్చారు. ముఖ్యంగా ఎలివేటెడ్ కారిడార్‌లో రక్షణ శాఖకు చెందిన స్థలాలకు అందాల్సిన రూ.303 కోట్లు పరిహార సొమ్ము కంటోన్మెంట్ బోర్డుకు దక్కేలా విశేష కృషి చేశారు.

'డబుల్' గృహాలపై కొత్త ఆశలు

ఏడేళ్ల క్రితం సికింద్రాబాద్ నియోజకవర్గంలో డబుల్‌బెడ్ గృహాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో నాలుగు ప్రాంతాల్లో కలుపుకొని మొత్తంగా 411 గృహాల నిర్మాణం పనులు పూర్తిచేశారు. ఇందులోని రెండు ప్రాంతాల్లో కేవలం 100 డబుల్‌బెడ్రూం ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మిగతా 311 గృహాల పంపిణీ చేయడం కోసం లబ్ధిదారుల ఎంపిక జరుగలేదు. బీఆర్‌ఎస్ పాలనలో సాంకేతిక కారణాలు చూపిన పాలకులు, అధికారులు లబ్ధిదారులకు గృహాలను ఏళ్ల తరబడి అందించలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ ప్రక్రియ ప్రారంభమైంది. మిగతా గృహాల పంపిణీ కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రారంభమైంది. – సికింద్రాబాద్



చిలకలగూడ ధోబీఘాట్‌లో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయం

ఏడేళ్లుగా ఎదురుచూపులు

- నిరుపయోగంగా 351 గృహాలు
- బీఆర్‌ఎస్ హయాంలో 72 మందికి అందజేత
- తాజాగా 28 మందికి సర్టిఫికెట్లు పంపిణీ
- ఎదురు చూస్తున్న లష్కర్ లబ్ధిదారులు

సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఏడేళ్ల క్రితం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లపై స్థానిక ప్రజల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. బీఆర్‌ఎస్ పాలనలో డబుల్‌బెడ్ గృహాల కోసం పలువురు ఆశలు పెట్టుకున్నా ఫలితం దక్కలేదు. అప్పట్లో కనీసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కూడా పూర్తిచేయలేకపోయారు. డబుల్‌బెడ్ గృహసముదాయ నిర్మాణం పూర్తయిన వెంటనే ప్రారంభోత్సవాలు చేశారు. ఆ తర్వాత నాలుగేళ్ల వరకు లబ్ధిదారుల ఎంపిక జరుగలేదు. సదరు గృహ సముదాయాలు వృథాగా పడి ఉండడంతో పాటు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మెట్టుగూడ డివిజన్ ధోబీఘాట్ స్థలంలో నిర్మించిన గృహాల కేటాయింపు విషయంలో జాప్యం జరుగుతున్న తీరుపై రెండేళ్ల క్రితం బీజేపీ నాయకులు కోర్టును ఆశ్రయించారు. ఇందుకు స్పందించిన హైకోర్టు డబుల్‌బెడ్రూంఇళ్లను లబ్ధిదారులకు అందించే విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించిన ప్రక్రియ ముందుకు సాగలేదు.

తాజాగా 28 మందికి పంపిణీ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇక్కడి కాంగ్రెస్ నాయకులు నిరుపయోగంగా ఉంటున్న డబుల్‌బెడ్ గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. తొలివిడతగా 28 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ నేతృత్వంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లబ్ధిదారులకు ఇళ్ల పొజిషన్ సర్టిఫికెట్లు అందించారు. వీరందరికీ సీతాఫల్‌మండి డివిజన్ సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో నిర్మించిన గృహ సముదాయంలో డబుల్‌బెడ్రూం ఇళ్లను కేటాయించారు.

311 గృహాల పంపిణీకి కసరత్తు

సీతాఫల్‌మండి సుభాష్‌చంద్రబోస్‌నగర్, అడ్డగుట్ట ఏసీఎస్ నగర్‌లో నిర్మించిన 100 గృహాల పంపిణీ పూర్తయింది. తార్నాక డివిజన్ చంద్రబాబునాయుడునగర్, మెట్టుగూడ డివిజన్ ధోబీఘాట్‌లో నిర్మించిన 311 డబుల్‌బెడ్ గృహాలు లబ్ధిదారులకు అందించాల్సి ఉంది. ఇప్పటికే 28 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, డబుల్‌బెడ్ గృహాలు అందించారు.

☛ మిగతా రెండు డివిజన్లలోని డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీ కోసం కాంగ్రెస్ పాలకులు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, అదే ప్రాతిపదికన లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు జరిగిందని ఇక్కడి కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. మిగతా గృహాలను అర్హులైన లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు చేస్తామని వారు పేర్కొంటున్నారు.

లబ్ధిదారుల్లో కొత్త ఆశలు..

మరో 311 డబుల్‌బెడ్ గృహాల పంపిణీ త్వరలో జరుగనుందన్న సమాచారంతో లష్కర్ లబ్ధిదారుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. సొంత ఇళ్లులేని పలువురు డబుల్‌బెడ్ దొరుకుతుందన్న ఆశతో కాంగ్రెస్ నేతల అనుగ్రహం కోసం వేచిచూస్తున్నారు. సాంకేతిక సమస్యల సాకుతో డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయాలను నిరుపయోగంగా ఉండడం కంటే అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు కాంగ్రెస్ నేతలు కృషి చేయాలని లష్కర్ ప్రజలు కోరుతున్నారు.

439 గృహాల నిర్మాణం

సీతాఫల్‌మండి డివిజన్ సుభాష్ చంద్రబోస్‌నగర్, మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ దూద్‌బావి, అడ్డగుట్ట డివిజన్ ఆజాద్ చంద్రశేఖర్ నగర్, తార్నాక డివిజన్ చంద్రబాబునాయుడునగర్ నాలుగు ప్రాంతాల్లో 411 గృహాలను నిర్మించారు. 2015 అక్టోబర్ 15న డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం కోసం శుకుస్థాపన చేశారు. 2021 జూలై 8న గృహ సముదాయాలకు లాంఛనంగా ప్రారంభోత్సవాలు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో 32 మంది, ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్‌లో 40 మంది లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లను కేటాయించారు. అప్పటి నుంచి మిగతా 339 గృహాలు లబ్ధిదారులకు కేటాయింపులు జరుగక నిరుపయోగంగా పడి ఉన్నాయి.

నూతన డీజీపీని కలిసిన డాక్టర్ శివప్రసాద్



రాంగోపాల్‌పేట్: ఇటీవల నూతనంగా నియమితులైన డీజీపీ శివధర్‌రెడ్డిని తెలంగాణ హోమియో డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చినుకని శివప్రసాద్ మంగళవారం కలిశారు. మంగళవారం డీజీపీని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సహస్ర ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి ఆయన డీజీపీకి వివరించారు. డ్రగ్స్ నిర్మూలనలో సహస్ర ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు.

భూలక్ష్మి అమ్మవారి ఆలయంలో అన్నదానం



భూలక్ష్మి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

బొల్లారం: బొల్లారం దోవెటన్ బజార్‌లోని భూలక్ష్మి అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీసీసీ సెక్రటరీ డాక్టర్ నర్సింహన్ కన్నన్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నర్సింహన్ కన్నన్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీర్వాదంతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్వింద్, గాంధీ, బాలరాజ్, శ్రీకాంత్, నరేందర్, నాగేందర్, రషీద్, సుమన్, రాజు, పురాణచందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి ప్రాజెక్టులపై సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం



సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తున్న దేశీయ, అంతర్జాతీయ నిపుణులు

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వప్నిక రేహా ఫౌండేషన్, జన విజ్ఞాన వేదిక, కార్యా ఫౌండేషన్, సురక్ష సంస్థలు సంయుక్తంగా ఎన్విరాన్‌మెంటల్ పొల్యూషన్- పిల్లల బాధ్యత-క్షేత్రస్థాయి ప్రాజెక్టులు అనే అంశంపై 15 రోజుల సర్టిఫికెట్ కోర్సును మంగళవారం ప్రారంభించారు. ఈ నెల 24 వరకు కొనసాగే ఈ కోర్సులో భాగంగా దేశీయ, అంతర్జాతీయ నిపుణులతో తరగతులు నిర్వహించనున్నారు. ప్రారంభ కార్యక్రమానికి సురక్ష (యూఎస్‌ఏ) సంస్థ నిర్వాహకులు ప్రసాద్ జాలాది, కార్యా ఫౌండేషన్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ ఎన్.హరనాథ్‌బాబు, అడ్వకేట్ టి.మహాలక్ష్మి, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ (పబ్లిక్ హెల్త్) జీ కొండల్‌రావు హాజరై విద్యార్థులకు ఇంటరాక్టివ్ పద్ధతిలో బోధించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా స్వీకరించాలని సూచించారు, సమాజ చైతన్యం నేటి యువతరంపైనే ఉందన్నారు. కాలుష్యం వల్ల కలిగే అనర్థాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించడం ద్వారా సమాజ మార్పు సాధ్యమవుతుందన్నారు. పర్యావరణానికి విఘాతం కలిగించే వస్తువుల వాడకం తగ్గించడంతో పాటు మొక్కలను విస్తృతంగా నాటి కాపాడుకోవడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోగలమని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రత్యేక కోర్సులు మరిన్ని నేర్చుకోవడమే కాకుండా సమాజంలో వాటి అమలుకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే పద్మావతి, జువాలజీ హెడ్ జ్యోతిర్మయి, హెల్త్ క్లబ్ కన్వీనర్ రజనీ, ఫ్యాకల్టీ డి.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు ఉచితమే.. అవయవాలు కాదు


ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ అడిషనల్ డీసీపీసీ వేణుగోపాల్‌రెడ్డి

సనత్‌నగర్: యువత లైక్స్, వ్యూస్ కోసం బైకుల మీద స్టంట్స్ చేస్తూ వారి అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారని హైదరాబాద్ ట్రాఫిక్-1 అడిషనల్ డీసీపీసీ వేణుగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బేగంపేటలోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ విద్యార్థులకు మంగళవారం రోడ్డు ప్రమాదాలు-నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. ప్రతిఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలు ఉచితం కానీ, అవయవాలు ఉచితంగా ఎవరూ ఇవ్వరని తెలిపారు. వాహనాలు ఎప్పుడూ కూడా నిర్లక్ష్యంగా నడపరాదన్నారు. దాని వల్ల వారి అమూల్యమైన ప్రాణాలు పోగొట్టుకోవడమే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా హాని కలిగించడం వల్ల కుటుంబాల్లో విషాదఛాయలు నెలకొంటున్నాయన్నారు. రోడ్డు దాటేటప్పుడు తప్పనిసరిగా జీబ్రా లైన్ వద్ద మాత్రమే దాటాలన్నారు. సిగ్నల్ జంప్, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదన్నారు. రోడ్డు భద్రతా నియమాలను అందరూ తప్పకుండా పాటించాలన్నారు. అంతేకాకుండా విద్యార్థులు సమాజంలో జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ మాట్లాడుతూ.. రహదారులపై ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలియజేశారు. కార్యక్రమంలో మేనేజర్ దయానంద్, కరుణాకర్, ప్రిన్సిపాల్ సుమన్‌రేఖ, సుష్మిత, బేగంపేట టీటీఐ సిబ్బంది సాయి కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నల్ల రిబ్బన్‌లతో ఓయూ అధ్యాపకులు నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఓయూ అధ్యాపకులు

లాలాపేట: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై నిండు కోర్టులోనే ఒక లాయర్ దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకులు నల్ల రిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. జస్టిస్ గవాయ్ భారతదేశంలో అనేక సామాజిక అవరోధాలను అధిగమించి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా ఎదిగారన్నారు. అనతి కాలంలోనే చారిత్రాత్మక తీర్పులను ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సి. కాశీం, ఆర్ట్స్ డీన్ ప్రొ. సయ్యద్ తలాత్ సుల్తానా, ప్రొ.లింగప్ప, ప్రొ. డైసి, ప్రొ.విజయ, ప్రొ లావణ్య, ప్రొ మాయాదేవి, కృష్ణకుమార్, నమ్రత, కొండా నాగేశ్వర్‌రావు, మేడీ శ్రీనివాస్, చలమల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడి

లాలాపేట: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ దాడి చేయడానికి బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఇది పూర్తిగా హేయమైన చర్యగా పేర్కొన్నారు. రాజ్యాంగ వ్యవస్థకు అవమానకరమన్నారు. ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఓయూలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా మాదిగ మేధావుల ఫోరం పేర్కొంది. సీజేఐ జస్టిస్‌పై దాడి చేసిన లాయర్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని జాన్ దర్శనం డిమాండ్ చేశారు.

వృత్తి ఫిజియో థెరపిస్టు.. ప్రవృత్తి దొంగతనాలు

లాలాపేట: ఓ ఫిజియో థెరపిస్టు తన వృత్తిని వదిలి, తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలు చేయడం ప్రవృత్తిగా మార్చుకున్న సంఘటన ఓయూ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. నిందిడిని నుంచి దాదాపు 14.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఓయూలో ఏపీ జగన్, ఇన్‌స్పెక్టర్ అప్పల నాయుడు వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లాకు చెందిన ఎం. బాల ధీరజ్(30) ఫిజియోథెరపిస్టు ప్రస్తుతం నాచారంలోని కాకతీయ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గత నెల 27న రాత్రి తార్నాక స్ట్రీట్ నెంబర్ 1లో ఓ ఇంటి వారందరూ తమ కొడుకు, కోడలిని దింపడానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. తిరిగి తెల్లవారుజామున ఇంటికి చేరుకోగా ఇంట్లో తన కొడుకు బెడ్‌రూం తెరిచి ఉండటాన్ని గమనించిన ఆ ఇంటి యజమాని అనుమానం వచ్చి వెళ్లి చూడగా, ఇంట్లోని బీరువా లాకర్ బాక్స్ కిందపడి ఉంది. ఇంకా వస్తువులన్ని చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇంట్లోని బంగారు ఆభరణాలు దొంగిలించబడ్డాయి. దీంతో వెంటనే బాధితుడు ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని ఈ నెల 6న పట్టుకొని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మృతదేహం లభ్యం



ఖదీర్(ఫైల్)

లాలాపేట: ఇంటి నుంచి తప్పిపోయిన ఓ వ్యక్తి శవమై లభ్యమైన సంఘటన ఓయూ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హబ్సిగూడలోని పీఅండ్‌టీ కాలనీకి చెందిన ఖదీర్(20) మూగ, చెవిటి వ్యక్తి. ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై ఓయూ పీఎస్‌లో ఇప్పటికే మిస్సింగ్ కేసు నమోదైంది. కాగా తప్పిపోయిన వ్యక్తి పీఅండ్‌టీ వెనకాల ఉన్న చెరువు వద్ద కాలువలో శవంగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

అమీర్‌పేట: లిఫ్ట్ గుంతలో కింద పడిన వ్యక్తికి తీవ్రగాయాల పాలైయ్యాడు. భవన యజమాని నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బాధితుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు చేయగా, ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ వారసీగూడకు చెందిన 59 ఏళ్ల ఎస్.నర్సింగ్‌రావు ఈ నెల 1న అమీర్‌పేటలోని పాస్‌పోర్టు కార్యాలయం సమీపంలోని శ్రీస్వాతి అంకుర్ అపార్ట్‌మెంట్స్‌కు వచ్చాడు. పై ఫ్లోర్ వెళ్లేందుకు గ్రౌండ్ ఫ్లోర్‌లో లిఫ్ట్‌ను తెరిచి లోపలకు కాలు పెట్టడగా లిఫ్ట్ లేకపోవడంతో కింద పడిపోయి తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడు నవీన్ స్థానికుల సహకారంతో గుంతలో పడ్డ తండ్రిని బయటకు తీశారు. సోమవారం ఫిర్యాదు చేయగా, అపార్ట్‌మెంట్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి



గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ వాణికి అభినందనలు తెలుపుతున్న మర్రి పురురవరెడ్డి

సనత్‌నగర్: గాంధీ ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన వాణిని బీజేపీ రాష్ట్ర యువనేత మర్రి పురురవరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా గాంధీ ఆస్పత్రిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్య, పార్కింగ్, మార్చురీ దుర్వాసన, గుండె సంబంధిత డాక్టర్ల కొరత సమస్యతో పాటు వివిధ రకాల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన కృషి చేయాలని ఆయన కోరారు. ఆయనతో పాటు సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో గుంటి సత్యనారాయణ, చంద్రపాల్‌రెడ్డి, కిరీటా, మాంచాల గోపి, పిట్ల శ్రీనివాస్, అన్నెపాక స్వామి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలి



మెడికల్ ఎడ్యుకేషన్ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న వైద్యనిపుణులు

గాంధీఆస్పత్రి: వైద్యవిద్యలో ఆత్యాధునిక బోధన పద్ధతులను ప్రవేశపెట్టి వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగు పర్చుకోవాలని పలువురు వైద్యనిపుణులు సూచించారు. గాంధీ మెడికల్ కాలేజీ రీజనల్ ట్రెనింగ్ సెంటర్‌లో 'బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్' అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గాంధీ, ఉస్మానియా, అసీఫాబాద్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ఇందిర, ప్రొఫెసర్ రాజారావు, ప్రొఫెసర్ లక్ష్మి, గాంధీఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణిలు మంగళవారం ప్రారంభించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) ఆదేశాల మేరకు తెలంగాణలోని 60 మెడికల్ కాలేజీలను మూడు రీజియన్స్‌గా విభజించారు. గాంధీ రీజనల్ కేంద్రం పరిధిలోని 26 మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ కిరణ్ మాదల తెలిపారు. రోగులు, రోగిసహాయకులు, పలు విభాగాలకు చెందిన వైద్యులు, సిబ్బందితో కమ్యూనికేషన్, వైద్యసేవలు మెరుగుపర్చుకునేందుకు నూతన బోధన పద్ధతులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. దేశవ్యాప్తంగా వైద్యవిద్య ప్రమాణాలను మెరుగు పర్చేందుకు కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీబీఎంఈ) కార్యక్రమంలో భాగంగా ఈనెల 10 వరకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు కొనసాగుతాయని వివరించారు. గాంధీ రీజనల్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ కిరణ్ మాదల, కోకన్వీనర్ సుబోధ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ రవిశేఖరరావు, రాజారామ్ పలు ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమాజానికి హాని కలిగిస్తే కఠినమైన చర్యలు

ఏసీపీ శశాంక్‌రెడ్డి



లాలాగూడ పీఎస్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి

అడ్డగుట్ట: సమాజానికి హాని కలిగించే విధమైన చర్యలకు పాల్పడితే సహించేది లేదని చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నగరంలో నేరాల నియంత్రణకు సీపీ ఆదేశాల మేరకు పగలు, రాత్రి అనే తేడా లేకుండా పూర్తి స్థాయిలో నిఘా పెంచినట్లు తెలిపారు. అర్ధరాత్రుల్లో అనవసరంగా రోడ్లపై సంచరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీ షీటర్లు ఇక ముందు ఏ కేసులో తలదూర్చినా వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. సత్ప్రర్తన కలిగి ఉండి ఎటువంటి కేసుల్లో ఇన్వాల్వ్ అవ్వకుండా ఉంటే వారిపై ఉన్న షీట్లు తొలగించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రఘు బాబు, డీఐ రామకృష్ణ, ఎస్ఐలు రామేశ్వర్‌రెడ్డి, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పకుంటే అడ్డుకుంటాం

మాదిగ మేధావుల ఫోరం

లాలాపేట: సాంఘీక సంక్షేమ, మైనార్టీ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను మాదిగ మేధావుల ఫోరం తీవ్రంగా ఖండించింది. మంగళవారం మాదిగ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి రాజేందర్, గౌరవాధ్యక్షుడు కాశీం, బెజ్జెంకి రాంబాబు, వీరస్వామి, కిరణ్, దర్శనం జాన్ తదితరులు మాట్లాడుతూ.. ఒకే పార్టీలో ఉంటూ తోటి సహచర మంత్రి అయిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన లక్ష్మణ్‌ను దున్నపోతుతో పోల్చి మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. అది కేవలం లక్ష్మణ్‌ను ఉద్దేశించి మాత్రమే కాదు మాదిగ జాతిని మొత్తాన్ని అవమానించారన్నారు. ఇప్పటికైనా తన తప్పు తెలుసుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా అడ్డుకుంటామని మాదిగ మేధావులు హెచ్చరించారు. సాయిబాబా, నరసింగరావు, రాజు, సతీష్ తదితరులు ఉన్నారు.